


**ఇల్లంతా సందడిగా వుంది. సుందరం భార్య రేవతి హడావిడిగా తిరుగుతోంది. అప్పుడే దీపాలు వెలిగాయి. చీకటి క్రమంగా చిక్కబడుతోంది. అప్పటికే ఆహ్వానించిన బంధువులు కొంతమంది వచ్చారు. ఇంకా కొంతమంది రాలేదు.**

తెల్లవారి అక్షరాభ్యాసం జరుపుకొనే సుందరం కొడుకు వాసు అప్పటికే వచ్చిన బంధువుల మధ్య సంతోషంగా తిరుగుతున్నాడు. వాడికి ఐదవ యేడు వచ్చింది. వాళ్ళ యింటి ఆనవాయితీ ప్రకారం వాసుకు ఐదవ యేటనే అక్షరాభ్యాసం చేసి బడిలో చేర్పించటానికి సంకల్పించాడు సుందరం. ముహూర్త నిర్ణయం జరిగిన తర్వాత శుభలేఖలు అచ్చువేయించి బంధువులకు పంపించాడు. కొంతమందికి ప్రత్యేకంగా ఉత్తరాలు రాశాడు. మరికొంతమంది ఇళ్ళకు వెళ్ళి స్వయంగా ఆహ్వానించాడు.

ఇలా ప్రత్యేకంగా ఆహ్వానించిన బంధువుల్లో సుందరం పినతండ్రి విశ్వనాథం ఆయన భార్య శకుంతల వున్నారు.

విశ్వనాథం ఓ పల్లెటూర్లో స్కూలు మాస్టారుగా ఉద్యోగం చేసి ఏడాదిక్రితం రిటైరు అయ్యాడు. ఆయనకు ఆ వూళ్లో ఎనిమిది ఎకరాల పొలం వుంది. స్వంత వ్యవసాయం, పాడి గేదెలు, బండీ, ఎద్దులూ వున్నాయి. సుందరం వంతుకు వచ్చిన రెండెకరాలు వాళ్ళ అన్నదమ్ముల పొలాలను కూడా ఆయనే పండిస్తున్నాడు. ఆయన సుందరానికి బాగా ఇష్టమయిన మనిషి. చిన్నతనంలోనే తండ్రిపోయిన సుందరాన్ని దగ్గిర వుంచుకొని చదువు చెప్పించాడు.

కానీ – ఆయన ఇంతవరకు సతీసమేతంగా సుందరం ఇంట్లో అక్షరాభ్యాసానికి అడుగుపెట్టలేదు. అందువల్ల సుందరం కొంచెం కంగారుగా వున్నాడు. అతని మనసులో ఏదో వుంది. అనీజీగా ఫీలవుతున్నాడు. ఇంతకీ సుందరం కొడుకు వాసు చేత అక్షరాభ్యాసం చేయవలసింది ఆయనే.

ఇంట్లోకీ బయటికీ తిరుగుతున్నాడు సుందరం. బాబాయి ఆరోగ్యం బాగాలేక రాలేకపోయాడేమోననే ఆలోచన అతనికి కలిగింది. కొన్ని రోజులుగా విశ్వనాథం ఆరోగ్యం బావుండటం లేదు.

ఇంటి ముందు రిక్షా ఆగింది.

రిక్షా దగ్గరకు వచ్చిన తర్వాత చూస్తే అందులో బాబాయి, పిన్ని అగుపించారు.

సుందరం ముఖం వికసించింది.

"సారీరా సుందరం, అనుకోకుండా ఆలస్యమయ్యింది." అన్నాడు విశ్వనాథం నొచ్చుకుంటున్నట్టు.

"అంతా వచ్చినట్టేనా?" అడిగింది శకుంతల పిన్ని రిక్షా దిగి.

"ఇక ఎవరొచ్చినా, రాకపోయినా దిగుల్లేదు పిన్నీ. మీరొచ్చేశారు. నాకు అంతేచాలు" అన్నాడు సుందరం సంతోషంగా–

వెనకనే ఆగిన రెండో రిక్షాలోనించి దిగిన మనిషిని అప్పుడు చూశాడు సుందరం.

భీముడిలా వున్నాడు.

"నువ్వా భీముడూ!" అన్నాడు ఆశ్చర్యంతో.

"నేనే" అన్నాడతను భుజాలెగరేస్తూ – అతని చేతిలోనున్న లగేజీ చూస్తూ "ఇవన్నీ ఏమిటి బాబాయ్" అనడిగాడు సుందరం.

"మన పెరట్లో, పొలంగట్లమీద కాసిన కూరగాయలూ, మన పాడిగేదెల తాలూకు పాలూ, పెరుగూ, నెయ్యీ వగైరా" చెప్పాడు విశ్వనాథం చిన్నగా నవ్వుతూ–

సుందరానికి కళ్ళు చెమర్చాయి.

తన పట్ల బాబాయికి వున్న ప్రేమ, ఆప్యాయతలు వీసమెత్తుకూడా తగ్గలేదనుకున్నాడు. తెల్లని లాల్చీ, పంచెతో హుందాగా ముందుకు నడిచి వెళుతున్న బాబాయిని ఆరాధనా భావంతో చూశాడు.

"పదండి బాబూ" అన్నాడు భీముడు.

అప్పుడు ఈలోకంలోకి వచ్చాడు సుందరం.

భీముడు నిజంగా భీముడిలాగానే వుంటాడు. అతని పేరు కూడా అదే. తల్లిదండ్రులు పెట్టిన పేరు భీమయ్య. ఏ వూరువాడో కానీ ఇరవైయ్యేళ్ళ క్రితం విశ్వనాథం ఇంటికి వచ్చి పాలేరుగా చేరి స్థిరపడిపోయాడు ఆ ఇంట్లో ఒక మనిషిలా – కష్టపడి పనిచేయటంతో అతని శరీరం కండలు తిరిగి భీముడనే పేరును సార్థకం చేసుకొంది. భీముడికిప్పుడు నలభైయేళ్ళు. ఎందుకో అతను పెళ్ళి చేసుకోలేదు. - అంతేకాదు. అతనికి అక్షరం ముక్క

కూడా రాదు. వేలిముద్ర మనిషి.

ఆ రాత్రి భోజనానంతరం అందరూ మాట్లాడుకుంటున్నప్పుడు 'వాసు' ముందుగనే నిద్రపోయాడు. సుందరం పడుకున్నా నిద్రపట్ట లేదు. అతనికి సంతోషంగా వుంది. తనకు అత్యంత ఇష్టమైన తన విశ్వనాధం బాబాయి తన కొడుక్కి అక్షరాభ్యాసం చేస్తున్నాడు. ఆయన అక్షరాభ్యాసం చేసిన వాళ్లంతా బాగా చదువుకుని ప్రయోజకులయ్యారు. ఆయన దీవెన అటువంటిది. మంచి మనసున్న మనిషి. రేపు తన కొడుకు కూడా తప్పకుండా ప్రయోజకుడవుతాడు. కొడుకు బంగారు భవిష్యత్తు గురించిన ఆలోచనలతో ఎప్పటికో నిద్రలోకి జారిపోయాడు.

తెల్లవారింది. మళ్ళీ సందడి మొదలయ్యింది. వాసుకి తలంటి స్నానం చేయించారు. కొత్త బట్టలు తొడిగారు. నుదిటి మీద పొడవాటి కుంకుమ బొట్టు పెట్టారు. వాసుచేత అక్షరాలు దిద్దించే పలక్కి పసుపు రాయించాడు విశ్వనాధం.

ఇంటిముందున్న ఖాళీ స్థలంలో షామియానా వేయించి కుర్చీలు పరిచారు. ఎనిమిదిన్నరయ్యేసరికి పురోహితుడు వచ్చాడు.

మరో పదినిముషాలకు ఇద్దరు టీచర్లు పిల్లలతో కలిసివచ్చారు.

అక్షరాభ్యాస కార్యక్రమం మొదలయ్యింది.

వాసుచేత ముందుగా విఘ్నేశ్వర పూజ, తర్వాత సరస్వతీ పూజ చేయించాడు పురోహితుడు. శ్రద్ధగా పూజ చేశాడు వాసు. బడి పిల్లలతోపాటు భీముడు కూడా ఆసక్తిగా చూశాడు.

తొమ్మిది గంటలకి పూజ పూర్తయ్యింది. అక్షరాభ్యాస ముహూర్తం వచ్చింది.

మనవడు వాసుని ఒళ్ళో కూర్చోపెట్టుకున్నాడు విశ్వనాధం. పసుపు పూసిన పలకను వాడివొళ్లో వుంచి బలపాన్ని వాడిచేత పట్టించి 'ఓం నమఃశివాయ' అనే అక్షరాలను రాయించాడు. తర్వాత వాటిని కొంచెం సేపు వాడిచేత అనిపిస్తూ దిద్దించాడు. వాటిని దిద్దుతూ ఒకసారి తలెత్తి చూశాడు వాసు. వాడికి ఎదురుగా వున్న తల్లిదండ్రులూ, భీముడూ కనిపించారు. భీముడికి వాసుకళ్ళలో కొత్తవెలుగు కనపడింది. ఓ అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చూడడం భీముడికి ఇదే తొలిసారి.

వాసుచేత సుందరం - విశ్వనాధం బాబాయికి. కొత్త బట్టలు పెట్టించాడు. వాసు తాతయ్య పాదాలకు నమస్కారం చేశాడు. తర్వాత సుందరం దంపతులు కూడా పిన్ని, బాబాయికి దణ్ణం పెట్టారు. వచ్చిన ఇద్దరు టీచర్లకు కూడా దక్షిణ తాంబూలం ఇప్పించి వాసుచేత దణ్ణాలు పెట్టించారు.

ఇక బడి పిల్లలకు పలకా బలపాలు, పప్పు బెల్లాలు పంచటానికి లోపల్నించి వాటిని తీసుకురమ్మని భీముడికి చెప్పాడు విశ్వనాధం.

## బాల్య స్మృతులు



చిన్నతనంలో హాయిగా ఆడుతూ పాడుతూ తిరుగుతాం. పెద్దయ్యాక అవన్నీ కోల్పోతాం. బాల్యాన్ని గుర్తు చేసుకుంటే ఎంతో బాధేస్తుంది. మా అమ్మా నాన్నలు పెట్టిన పేరు లలిత. ఇద్దరు సోదరులు, ఓ చెల్లెలుతో బాల్యం సరదాగా గడిచిపోయింది. సినిమాల్లో జయప్రదగా మార్చారు. హీరోయినయ్యాక నా ఫ్రెండ్సందరూ నన్ను అదోలా చూసేవాళ్ళు. వ్యంగ్యంగా మాట్లాడుతుండేవాళ్ళు. నా గొప్పతనాన్ని చూసి ఓర్చుకోలేకనే వాళ్ళు అలా ప్రవర్తిస్తున్నారనుకునేదాన్ని. నేను హీరోయిన్‌గా పాపులరయ్యాక నా స్వగ్రామంలో ఓ కార్యక్రమానికి వెళ్ళాను. అక్కడ మా టీచర్ సభకు నన్ను పరిచయం చేస్తూ లలిత అని చెప్పాలో, జయప్రద అని చెప్పాలో అని సందేహిస్తూనే జయప్రద అనే సంబోధించారు. కానీ 'నేను ఎప్పటికీ మీకు లలితనే. జయప్రద అన్నది సినిమాల్లో వచ్చిన పేరు' అని చెప్పగానే మా టీచర్, అక్కడి వాళ్ళందరూ చాలా సంతోషించారు.

తర్వాత భీముడు అన్నీ తీసుకువచ్చి విశ్వనాధం పక్కన నిల్చుని "అయ్యా! ఒకటడుగుతాను నవ్వరు కదా!" అన్నాడు ఆయనతో.

"ఏమిట్రా భీముడూ, అడుగు నవ్వటం ఎందుకూ?" అన్నాడు విశ్వనాధం.

"తవరు నాక్కూడా అచ్చరాబ్బాసం సేయింసాల" అన్నాడు సిగ్గుపడుతూ భీముడు.

ఆ మాట విని అక్కడున్న వాళ్లంతా ఆశ్చర్యపోయారు.

"ఒరేయ్.. ఈ వయసులో నీకు ఈ ఆలోచనేమిట్రా? ఇప్పుడు నీకు అక్షరాభ్యాసమా??" అన్నాడు సుందరం మేనమామ జానకి రామయ్య నవ్వుతూ...

"నీది చదువుకునే వయసేంట్రా భీముడూ" అన్నాడు ఇంకో ఆయన.

"నాకూ సదూకోలనిపించింది. అయ్యగారి దగ్గర సదూకుంటాను" అన్నాడు భీముడు తలెత్తి.

పిల్లలంతా నవ్వుతున్నారు.

వాసు వింతగా చూశాడు భీముడిని.

విశ్వనాధం ఆశ్చర్యంనించి తేరుకుని–

"ఒరేయ్ భీముడూ.. ముందుగా నిన్ను మెచ్చుకుంటున్నాను. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినందుకు ఇవాళ నిజంగా గర్వపడుతున్నాను. సాధారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తారు. కానీ ఇవాళ నువ్వే నీకు అక్షరాభ్యాసం చేయించమని అడిగావు. నాకెంతో సంతోషంగా వుంది. ఇప్పుడు నీలో ఆ జిజ్ఞాస కలిగింది. చదువుకు వయసుతో పనిలేదు. బాలవ్యాకరణాన్ని రాసిన చిన్నయ్య సూరి పదకొండేళ్ళ తర్వాతనే చదువుకున్నాడు. చదువు అనేది కేవలం అపారమైన విజ్ఞానాన్ని సంపాదించటానికీ, గొప్ప ఉద్యోగాలు చెయ్యటానికే కాదు. కనీసలోక జ్ఞానానిక్కూడా ఎంతో కొంత చదువు అవసరం. నీకు నేను అక్షరాభ్యాసం చేయిస్తాను. "ముందు నువ్వు ఈ కొత్త బట్టలు కట్టుకుని రా" అంటూ సుందరం తనకు పెట్టించిన బట్టలను భీముడికిచ్చాడాయన.

ముందు వద్దన్నా విశ్వనాధం బలవంతం మీద కొత్త బట్టలను కట్టుకుని వచ్చాడు భీముడు. విశ్వనాధం తనే ఓ కొత్త పలక్కి పసుపు రాశాడు. భీముడి నుదుట కుంకుమ పెట్టి తన పక్కనే కూర్చోబెట్టుకుని అతని చేయి పట్టుకుని అక్షరాలను రాయించి దిద్దించాడు.

బాబాయిని ఆశ్చర్యంతోనూ, భక్తితోనూ చూశాడు సుందరం.

క్షణం తర్వాత కొత్తబట్టలతో, నుదుట కుంకుమతో ఐదేళ్ళ వాసుతోపాటు తనూ పలకా బలపాలు, పప్పు బెల్లాలు బడిపిల్లలకు ఉత్సాహంతో పంచటం మొదలుపెట్టాడు నలభైయేళ్ళ భీముడు.